క్లుప్తంగా

రాజీవ్ యువవికాసం దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీవో

సిర్పూర్(టి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులను సోమవారం ఎంపీడీవో సత్యనారాయణ ఆయన కార్యాలయంలో స్వీకరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు మండలంలో 1230 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని గాంధీపార్క్, మార్కెట్ ఏరియాలో విద్యుత్ సరఫరాలో మంగళవారం అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ కమలాకర్ తెలిపారు. గాంధీపార్క్‌లో విద్యుత్ తీగలను ఆనుకుని ఉన్న చెట్ల తొలగింపు కార్యక్రమం ఉన్నందున ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇసుక డంపు సీజ్



సీజ్ చేసిన ఇసుక డంపు

ఆసిఫాబాద్‌రూరల్: అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపును సోమవారం సీఐ రవీందర్ సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని చిర్రకుంట గ్రామ శివారులో అక్రమంగా ఇసుక నిల్వ ఉన్నట్లు అందిన సమాచారం మేరకు తనిఖీలు చేయగా ఇసుక నిల్వ ఉండటంతో సీజ్ చేశామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి సమారు 100 ట్రిప్పుల ఇసుక డంప్ చేశారని, పట్టుకున్న ఇసుక డంపును రెవెన్యూ సిబ్బందికి అప్పగించినట్లు తెలిపారు.

కేజీబీవీకి ఫ్యాన్లు విరాళం



ఫ్యాన్లు విరాళంగా అందజేస్తున్న సభ్యులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి నిషా జోష్రీ, జగేంద్ర కుమార్ జోష్రీ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం ట్రస్టు సభ్యుడు గడ్డం మహేశ్ గౌడ్ ఐదు సీలింగ్ ఫ్యాన్లు విరాళంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ బడుల్లో ట్రస్టు తరఫున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వో కవిత, ట్రస్టు సభ్యులు భుజంగరావు, రాజాగౌడ్, తిరుమల్‌గౌడ్, రేణుక, హరీశ్, లక్ష్మణ్, ఉపాధ్యాయులు వెన్నెల, విద్యార్థినులు పాల్గొన్నారు.

‘భూ భారతితో రైతుల సమస్యలకు పరిష్కారం’



సంబరాలు చేసుకుంటున్న నాయకులు

రెబ్బెన: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూ భారతి ద్వారా రైతుల భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్ అన్నారు. భూ భారతిని ప్రారంభించిన సందర్భంగా మండలంలోని రైతువేదికల వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మాజీ జెడ్పీటీసీ సోమయ్య, మాజీ ఎంపీటీసీ పెసరు మదునయ్య, ఏవో దిలీప్‌కుమార్, ఏఈవోలు సంజీవ్, రాకేశ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాయికిరణ్, నాయకులు జహీర్ బాబా, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక లింగాష్టక పారాయణం

బోథ్: సొనాల మండల కేంద్రంలోని శ్రీరాజ రాజేశ్వర మందిరంలో సోమవారం సామూహిక లింగాష్టక పారాయణం నిర్వహించారు. ఉదయం 7:30 గంటలకు ఏడవ సామూహిక లింగాష్టక పారాయణం ప్రారంభమైంది. ప్రతీ సోమవారం ఆలయంలో లింగాష్టక పారాయణం నిర్వహిస్తామని శివాలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మొత్తం 21 వారాలపాటు సామూహిక లింగాష్టక పారాయణం కొనసాగుతుందన్నారు. అర్జున్ దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



పెంచికల్‌పేట్: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

- ఊరూరా జయంతి వేడుకలు



లింగాపూర్: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎస్సై గంగన్న

దహెగాం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు నెరవేర్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్సై రాజు, ఎంఈవో శ్రీనివాస్‌లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా పంచశీల జెండా ఎగురవేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలోని అంగడిబజార్, పీపీ రావు కాలనీ, ఐనం, కోత్మీర్, తదితర గ్రామాల్లో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మాల మహానాడు సంఘం జిల్లా అధ్యక్షుడు దుంద్ర శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌బాబు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రామ్మోహన్, నాయకులు, వ్యాపారులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ 134 జయంతి ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. చేడ్వాయి, ఎల్కపల్లి గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. గ్రామాల్లో పంచశీల జెండా ఆవిష్కరించి దేశానికి ఆయన చేసిన సేవలు కొనియాడారు. అనంతరం ఎల్లూర్, కొత్తగూడ, పెంచికల్‌పేట్ మీదుగా ఎలకపల్లి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘాల నాయకులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండలంలో సోమవారం అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాలలో అంబేడ్కర్ సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. చింతలమానెపల్లి, డబ్బా, రణవెల్లి, గూడెం, బాలాజీఅనుకోడ, రుద్రాపూర్ గ్రామాలలో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయాలలో అధికారులు అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి జయరాజ్, రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ఉన్నతమైన అంబేడ్కర్ ఔనత్యాన్ని అందరూ గౌరవించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. సోమవారం మండలంలోని రణవెల్లి గ్రామంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. బుద్ధవిహార్‌లో పూజలు నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం రణవెల్లి గ్రామంలో అంబేడ్కర్ కమ్యూనిటీ భవనానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. జెడ్పీ మాజీ చైర్మన్ సిడం గణపతి, మాజీ ఎంపీపీ డుబ్బుల నానయ్య, పార్టీ మండల కన్వీనర్ సుల్కరి ఉమామహేశ్, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు బండి మహేశ్, మాజీ సర్పంచులు జాటోత్ సోమేశ్, మోర్లె గణపతి, రవి, నాయకులు మేకల జనార్దన్, గోలేటి శంకర్, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లింగాపూర్: మండల కేంద్రంలోని బుద్ధవిహార్ మందిరంలో సోమవారం ఘనంగా అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నదానం కార్యక్రమం చేపట్టారు.

సిర్పూర్(టి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవన్‌లో పంచశీల జెండా ఆవిష్కరించి బస్టాండ్ ప్రాంతంలోని చౌరస్తాలో పంచశీల జెండా ఆవిష్కరించారు. డౌనల్ ప్రాంతంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో పి.సత్యనారాయణ వారి కార్యాలయాల్లో నివాళులర్పించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు మండలంలోని పారిగాం, జక్కాపూర్, లోనవెల్లి, డోర్‌పల్లి తదితర గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. నాయకులు దుర్గం విక్రమ్, దుర్గం తులసీరాం, నగ్రాడె రాజు, దుర్గం తిరుపతి, శివరాం, సోగల రమేశ్, దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలో సోమవారం అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్సీ దండె విఠల్ పాటు పలు పార్టీల నాయకులు, వివిధ సంఘాల నాయకులు నివాళులర్పించారు. ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు ముబీన్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, తెలంగాణ జాగృతి జిల్లా మాజీ అధ్యక్షుడు పర్శ చంద్రశేఖర్ అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. పట్టణంలోని కాపువాడలో గల ఎమ్మెల్సీ నివాసంలో ఎమ్మెల్సీ దండె విఠల్ మొక్కలు నాటారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆసిఫాబాద్‌రూరల్: అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని సోమవారం మండలంలోని మోతుగూడ, బూర్గుడ, రహపల్లి, సాలేగూడ, పర్సనంబాల, అప్పపల్లితో పాటు అన్ని గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాలీ సంఘం గ్రామ అధ్యక్షుడు గులాబ్, గ్రామస్తులు గణపతి, సురేశ్, రవీందర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: మండల కేంద్రంతో పాటు బారెగూడెం, పోతేపల్లి సలగుపల్లి, లుంబినగర్, మర్తిడి, సులగుపల్లి తదితర గ్రామాల్లో సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన జెండా ఎగురవేశారు. ఆయా గ్రామాల్లో అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు వాసుదేవ్, నాయకులు పాల్గొన్నారు.

కౌటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో అంబేడ్కర్ 134వ జయంతి ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని ముత్తంపేట్, గుడ్లబోరి, సదాశివపేట, భాలేపల్లి, వీర్దండి, తాటినగర్, పార్డీ, తలోడి, యాపలగూడ, గుండాయిపేట, తుమ్మిడిహెట్టి, కౌటాల, బోదంపల్లి, కనికి, తదితర గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు మహర్ నాయకులు పూలమాలలు వేసి జయంతి నిర్వహించారు. పంచశీల జెండాలు ఎగురవేశారు. డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కుమురం మాంతయ్య, ఎంపీడీవో కోట ప్రసాద్, ఎంఈవో గావుడే హన్మంతు, బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, మహర్ సంఘం నాయకులు మోతిరాం, బండు రావు, జానకీరావ్, అశోక్, రావుజీ తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి: దేశానికి అంబేడ్కర్ మహనీయుడని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు జువ్వాజి అనిల్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిత్తారి సాగర్, ఆదివాసీ మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు కమల తదితరులు ఉన్నారు.

వాంకిడి: మండలంలో బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. వాంకిడి, ఖమాన, కనర్‌గాం, ఇందాని, ఖిరిడి, తదితర గ్రామాల్లో జయంతి నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి పంచశీల, ధమ్మ చక్ర జెండాలు ఆవిష్కరించారు. అన్నదాన కార్యక్రమాలతో పాటు సాయంత్రం శోభాయాత్ర నిర్వహించారు.



చింతలమానెపల్లి: మాట్లాడుతున్న దండె విఠల్

రెబ్బెన: రాజ్యాంగ నిర్మాణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాత్ర కీలకమని బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం మచ్చగిరి నరేందర్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో బీఆర్ అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జీఎం కార్యాలయంలోని చిత్రపటానికి, కార్యాలయ ఆవరణలో ఉన్న విగ్రహానికి కార్మిక సంఘాల నాయకులు, అధికారులతో కలిసి జీఎం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఎస్‌వోటుజీఎం రాజమల్లు, ఏఐటీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, ఎస్సీ లైసన్ అధికారి రెడ్డిమల్ల తిరుపతి, ఎస్టీ లైసన్ అధికారి శ్రీరాములు, అధికారుల సంఘం ప్రతినిధి రవికుమార్, ఎస్టీ ఎంప్లాయీస్ అసోషియేషన్ నాయకులు మంగీలాల్, ఎస్సీ అసోషియేషన్ నాయకులు అంబేడ్కర్, అనిల్, హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

ఖైరిగూడ ఓసీపీలో..

బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో సోమవారం బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గని మేనేజర్ శంకర్, ఇన్‌చార్జి ప్రాజెక్టు ఇంజనీరు నరేశ్, సంక్షేమ అధికారి రజని కుమార్, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో..

మండలంలోని అన్ని గ్రామాల్లో బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రామ్మోహన్‌రావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గోలేటిలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించగా రెబ్బెన సీఐ బుద్దె స్వామి, ఎస్సై చంద్రశేఖర్‌లు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలో దళిత సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించారు. పంచశీల జెండా ఆవిష్కరించారు. రాంపూర్, నారాయణపూర్, వంకులం తదితర గ్రామాల్లోనూ జయంతి వేడుకలను దళిత, అంబేడ్కర్ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీడీవో శంకరమ్మ, మాజీ జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అంజనేయులుగౌడ్, పార్లమెంట్ కోకన్వీనర్ కొలిపాక కిరణ్, జిల్లా కార్యదర్శి కుందారపు బాలక్రిష్ణ మండల అధ్యక్షుడు రాంబాబు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు దుర్గం రవీందర్ ఉన్నారు.



చింతలమానెపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో..



దహెగాం: పూలమాలలు వేస్తున్న ఎస్సై, ఎంఈవో



రెబ్బెన: నివాళులర్పిస్తున్న నాయకులు



రెబ్బెన: కేక్ కట్ చేస్తున్న ఇన్‌చార్జి జీఎం నరేందర్



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు



కెరమెరి: ఎంపీడీవో కార్యాలయంలో..



ఆసిఫాబాద్‌రూరల్: పూలమాల వేస్తున్న నాయకులు

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయంతో పాటు వివిధ గ్రామ పంచాయతీల్లో, అంబేడ్కర్ దీక్ష భూమిలో, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఎంపీవో అంజద్‌పాషా, మాజీ ఎంపీపీ పెందోర్ మోతిరాం, మాజీ జెడ్పీటీసీ అబ్దుల్ కలాం తదితరులు ఉన్నారు.



సిర్పూర్(టి): నివాళులర్పిస్తున్న అధికారులు



కౌటాల ఎంపీడీవో కార్యాలయంలో..



వాంకిడి: ఖమాన గ్రామంలో..



తిర్యాణి : శాటిలైట్ ఆశ్రమ పాఠశాలలో..



నివాళులర్పిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

పోషణ్ పక్వాడా షురూ..!

- ప్రారంభమైన 7వ విడత కార్యక్రమం
- పోషకాహారంపై విస్తృత ప్రచారం
- ఈనెల 22 వరకు కొనసాగింపు



ఎల్కపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా

పెంచికల్‌పేట్: పోషకాహార లోపాన్ని నివారించడంతో పాటు పోషకాహార ప్రాముఖ్యత ప్రతీ ఒక్కరికి తెలియజేసేందుకు 7వ విడత పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 15 రోజుల పాటు నిర్వహిస్తున్న పోషణ్ పక్వాడా ఈనెల 8వ తేదీన ప్రారంభమై 22వ తేదీన ముగించనున్నారు. విద్య, వైద్య, ఐసీడీఎస్, ఐకేపీ సిబ్బంది సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. భావితరాల్లో పోషకాహార లోపాన్ని నివారించడానికి ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

జిల్లాలో..

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు 973 ఉన్నాయి. వాటిల్లో ఆరు నెలల నుంచి ఐదు సంవత్సరాల వయస్సు గల చిన్నారులు 40182 మంది ఉన్నారు. గర్భిణులు 4688, బాలింతలు 3502 కిశోర బాలికలు 16564 మంది అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. వీరికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతీనెల పాలు, గుడ్లు, పోషకాహారం అందజేస్తున్నారు.

ఇంటింటా పోషణ సంబరాలు..

పోషకాహార లోపాన్ని నివారించడంతో పాటు పోషకాహారం ప్రాముఖ్యత ప్రతీ ఒక్కరికి తెలియజేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఏటా పోషణ పక్షోత్సవాలు నిర్వహిస్తోంది. గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సదస్సులను నిర్వహిస్తూ ప్రతీఒక్కరిని భాగస్వాములను చేస్తుంది. పోషకాహార లోపం వలన కలిగే అనారోగ్య సమస్యలను తెలియజేస్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కేంద్రాల్లో వివిధ రకాల పోషకాహారం కలిగిన ఆహార పదార్థాలను తయారు చేసి అవగాహన కల్పిస్తున్నారు. రోజువారీగా తీసుకునే ఆహారంలో తృణధాన్యాలు, ఆకుకూరలు, పాలు, గుడ్లు, పండ్లు, మినుములు, పెసర్లు, రాగి జావా, బెల్లం, ఉండేలా చూసుకోవాలని తెలియజేస్తున్నారు.

విస్తృత ప్రచారం కల్పిస్తున్నాం

పోషణ్ పక్షోత్సవాల్లో భాగంగా ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గ్రామాల్లోని మహిళలు, బాలికలకు పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నాం. తక్కువ బరువు కలిగిన పిల్లలపైన ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి పోషకాహారం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేస్తాం.

- హసీనా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, పెంచికల్‌పేట్

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చింతలమానెపల్లి: మండల కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోలేటి శంకర్ మాట్లాడుతూ దేశంలోనే మొదటిసారిగా ఎస్సీ వర్గీకరణ చేస్తూ ఏకగ్రీవంగా బిల్లు అసెంబ్లీలో ఆమోదింప చేసిన సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల కన్వీనర్లు ఉమామహేశ్, విశ్వేశ్వర్, కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు మహేశ్, నాయకులు ఇప్ప శ్రీనివాస్, కొండు శ్రీనివాస్, జనార్దన్, శంకర్, దస్తగిరి, తిరుపతి, ప్రవీణ్, డోకె శ్రీనివాస్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న నాయకులు

కౌటాల: కౌటాల వారసంతలో సోమవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా నాయకుడు పాల్వాయి సుధాకర్‌రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ ఎండవేడి పెరుగుతుందని, ప్రజలు వేడి నుంచి ఉపశమనం పొందడానికి మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వేసవి కాలం ముగిసే వరకు ప్రతీ సోమవారం మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు కుంచాల విజయ్, నాయకులు దుర్గం మోతిరాం, మల్లయ్య, బూర్ల రవి, మధుకర్, తిరుపతి, సాయి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

కౌటాల: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కుమురం మాంతయ్య అన్నారు. సోమవారం కుమురం భీం ఉత్సవ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కుమురంభీం కమ్యూనిటీ హాల్ ఎదుట చలివేంద్రం ఏర్పాటు చేయగా ఆయన ప్రారంభించారు. చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య, నాయకులు వానుపటేల్, అశోక్, ఆత్మరాం, ఎడ్ల తిరుపతి, సాయినాథ్, మిథున్, గోసాయి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా తరలింపు..!



కౌటాల: కౌటాల –బెజ్జూర్ ప్రధాన రహదారిపై ట్రాక్టర్‌కు విద్యుత్ స్తంభాలను వెనుకభాగంలో కట్టి సోమవారం ప్రమాదకరంగా తరలించారు. తలోడి శివారులో విద్యుత్ స్తంభాలు ఉండగా గుత్తేదారు గురుడుపేట శివారుకు రోడ్డుపై నుంచే ఈడ్చుకుంటూ తరలించాడు. దీంతో రహదారి ధ్వంసమవుతోందని మండలవాసులు పేర్కొంటున్నారు. ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉందని వాపోతున్నారు.